మహాచండీగా దర్శనమిచ్చిన అమ్మవారు


నందిగామలో అన్నపూర్ణాదేవిగా దర్శనమిస్తున్న సుఖశ్యామలాంబ అమ్మవారు


నందిగామలో మహాచండీగా దర్శనమిస్తున్న అమ్మవారు


మహాలక్ష్మీదేవిగా దర్శనమిస్తున్న సత్యమ్మ అమ్మవారు


వత్సవాయిలో మహాచండీ అవతారంలో అమ్మవారు


గండేపల్లిలో అమ్మవారు

నందిగామ: డివిజన్‌వ్యాప్తంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఐదోరోజైన గురువారం అమ్మవార్లు పలురూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. నందిగామ పట్టణంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారు మహాచండీదేవిగా, శుక శ్యామలాంబ అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక మరిడి మహాలక్ష్మి అమ్మవారు, అంబారుపేటలోని శ్రీ సత్యమ్మ అమ్మవారు, పల్లగిరి గట్టు పైగల త్రిశక్తి పీఠంలోని కనకదుర్గ అమ్మవారు మహాలక్ష్మిదేవిగా దర్శనమిచ్చారు. పట్టణంలోని పలు కూడళ్లు, మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో కొలువుదీరిన అమ్మవార్లకు భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. దసరా మహోత్సవాలను పురస్కరించుకొని బతుకమ్మ సంబరాలు కూడా సందడిగా సాగుతున్నాయి.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి : దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారు మహాచండీగా భక్తులకు దర్శనమిచ్చారు. చిట్టేల వెంకటేశ్వర స్వామి ఆలయం, వత్సవాయిలో శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయం, మక్కపేట, అయ్యప్ప, ప్రసన్నాంజనేయస్వామి ఆలయాలు, మంగొల్లు రామాలయం, శివాలయం, లింగాలలో ఉమామహేశ్వరస్వామి ఆలయాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. నవరాత్రులు సందర్భంగా విగ్రహాల వద్ద అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వీరులపాడు మండలంలో ఘనంగా జరుగుతున్నాయి. మహోత్సవాల్లో భాగంగా గురువారం ఆయా గ్రామాల్లోని ఆలయాలు, ప్రధాన కూడళ్లలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దుర్గమ్మ అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి సామూహిక కుంకుమార్చనలు, పూజలు నిర్వహించారు. మండలంలోని అల్లూరులో వేంచేసియున్న సీతారామచంద్రస్వామి సహిత మహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో అమ్మవారిని కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ధర్మకర్తలు అల్లూరు భాస్కరరావు, అంజనాదేవి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. జుజ్జూరు గ్రామంలో ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

పెనుగంచిప్రోలు: దసరా నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఐదోరోజు గురువారం పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. తూర్పు బజారున శ్రీదుర్గామల్లేశ్వరస్వామి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నవరాత్రుల పందిరిలో అమ్మవారు శ్రీమహాచండిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో ఉత్సవాల్లో భాగంగా కుంకుమ పూజలు చేశారు. శ్రీస్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయం, ముండ్లపాడులో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగాయి. అమ్మవార్ల మండపాలను భక్తులు సందర్శించి పూజలు చేశారు.

జగ్గయ్యపేట మండలంలో..

జగ్గయ్యపేట: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గురువారం అమ్మవారు మహాచండీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా గ్రామాల్లోని ఆలయాలు, ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక మంటపాల్లో కొలువుదీరిన దుర్గాదేవికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. షేర్‌మహ్మద్‌పేట, అనుమంచిపల్లి, బలుసుపాడు, గౌరవరం గ్రామాల్లోని అమ్మవార్ల విగ్రహాలకు అర్చకులు విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేట అర్బన్ : శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఐదోరోజైన గురువారం పట్టణంలో పలు ఆలయాల్లో అమ్మవారు శ్రీమహాచండీదేవిగా దర్శనమిచ్చారు. స్థానిక నకాశిబజారులో వేంచేసియున్న శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో ఉదయం వేద పండితులు మహంకాళి రామప్రశాస్త్రి ఆధ్వర్యంలో శ్రీచండి మూలమంత్ర సహిత రుద్రహోమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అద్దాలబజారులోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయంలో నిర్వహించిన సువాసినీ పూజలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. దుర్గాపురంలోని శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు శ్రీఅన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చారు. చెరువుబజారులోని శ్రీరేణుకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శ్రీసోమవంశ సహస్రార్జున క్షత్రియ(ఖత్రి) సమాజ్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించగా, శ్రీలలితా త్రిపురసుందరీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అద్దాలబజారులో ఉన్న శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారు శ్రీకాత్యాయినీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.


జుజ్జూరు రోడ్డులో ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల : దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా పలు గ్రామాల్లో కమిటీ సభ్యులు చలువ పందిళ్లు వేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని జుజ్జూరు రోడ్డులో విశ్వశాంతి మిత్ర మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి అన్నపూర్ణాదేవిగా, స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని గండేపల్లిలో కాటా నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారికి భక్తులు, మాలాధారులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్న సమారాధన చేశారు.


పెనుగంచిప్రోలులో శ్రీమహాచండీ అలంకరణలో అమ్మవారు


అల్లూరులో మహాలక్ష్మీదేవిగా అమ్మవారు


పేటలో శ్రీకాత్యాయినీదేవి అలంకరణలో అమ్మవారు


వెండి దేవాలయంలో శ్రీమహాచండీదేవిగా అమ్మవారు


శ్రీదుర్గాపురంలోని శ్రీఅన్నపూర్ణదేవిగా అమ్మవారు

క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌ సీపీ సమావేశం

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక కోదాడ రోడ్‌లోని బి కన్వెన్షన్‌లో శుక్రవారం ఉదయం పదిగంటలకు వైఎస్సార్‌ కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం జరుగుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ముఖ్యఅతిథులుగా ప్రభుత్వవిప్ ఉదయభాను, రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు వెల్లంపల్లి శ్రీనివాసరావు, నియోజకవర్గ పరిశీలకుడు నూతలపాటి హనుమయ్య హాజరుకానున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ ప్రకటనలో కోరారు.

ఘనంగా మరియమాత జపమాల ఉత్సవం



బలుసుపాడు(జగ్గయ్యపేట అర్బన్): మండలంలోని బలుసుపాడులో గురువారం రాత్రి మరియమాత జపమాల గ్రామోత్సవాన్ని గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. జగ్గయ్యపేట విచారణ గురువు ఫాదర్ జె.జయరాజు ఆధ్వర్యంలో అఖండ జపమాల మరియమాత ఊరేగింపును గ్రామ వీధుల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ జయరాజు ప్రసంగిస్తూ క్రైస్తవులకు అక్టోబర్ నెల మరియమాత జపమాల నెల అని పేర్కొన్నారు. ఈ నెలలో మరియ మాతను వేడుకుంటే అంతా శుభం జరుగుతుందని వివరించారు. అనంతరం ఆర్‌సీఎం చర్చిలో దివ్యబలి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. సిస్టర్లు మేరీ ఆంటోని, లావణ్య, అనిత, వసంత, ఉపదేశి డి.అలోషియస్, సంఘ పెద్దలు మేరి వినీత, ఉప్పుతోళ్ల బాలస్వామి, కొరివి బాబురావు, గండమాల సురేష్, ఉపదేశకులు, సంఘస్తులు పాల్గొన్నారు.

కేడీసీసీబీ చైర్‌పర్సన్‌కు సత్కారం



నందిగామ: కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తాతినేని పద్మావతిని బ్యాంకు డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్ సత్కరించారు. పద్మావతి గురువారం మాగల్లులోని రవిశంకర్ నివాసాన్ని సందర్శించారు. డివిజన్ పరిధిలోని కేడీసీసీ బ్యాంకు సిబ్బంది చైర్‌పర్సన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆమెను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాగల్లు ఎంపీటీసీ సభ్యురాలు కే శోభారాణి, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

పార్కు అభివృద్ధికి చర్యలు



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని శ్రీసామినేని విశ్వనాథం చిల్డ్రన్ మున్సిపల్ పార్కు అభివృద్ధికి కృషి చేయనున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రీసామినేని విశ్వనాథం చిల్డ్రన్ మున్సిపల్ పార్కులో రూ.5లక్షలతో నిర్మించిన మరుగుదొడ్లు, ఇతర అభివృద్ధి పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ హఫీజున్నీసా ఫిరోజ్, వార్డు కౌన్సిలర్ కన్నెబోయిన రామలక్ష్మితో కలసి గురువారం ఆయన ప్రారంభించారు. ట్రాక్, విద్యుద్దీకరణ పనులు చేపట్టాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. పిల్లలు ఆడుకునేందుకు ఆటపరికరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు, బీసీ నేతలు చంద్రమౌళి, జయకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



నందిగామ: కంటిచూపు సక్రమంగా లేకపోతే ప్రపంచమే చీకటై పోతుందని కెవీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.రాయప్ప పేర్కొన్నారు. పట్టణంలోని కెవిఆర్ కళాశాల విద్యార్థులకు గురువారం ఉచిత కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. వైద్యులు మొత్తం 187 మంది విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు చేశారు. అధ్యాపకులు స్వామి, గాంధీ, కిషోర్ పాల్గొన్నారు.

కోహాన్స్ కంపెనీ సేవలు ప్రశంసనీయం



పెనుగంచిప్రోలు: కరోనా సమయంలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు మరువలేనివని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో గురువారం ముక్త్యాల వద్ద గల కోహాన్స్ లైఫ్ సైన్సెస్ కంపెనీవారి సీఎస్ఆర్ నిధులతో పారిశుద్ధ్య కార్మికులకు ఆప్రాన్, కళ్లజోళ్లు, గమ్ బూట్లు, హ్యాండ్ గ్లవ్స్ పంపిణీ చేశారు. అనంతరం ఉదయభాను మాట్లాడుతూ ప్రజారోగ్యం కోసం కష్టించే శ్రమజీవులు పారిశుద్ధ్య కార్మికులని పేర్కొన్నారు. కోహాన్స్ కంపెనీవారు కోట్లాది రూపాయల నిధులతో నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తున్నారంటూ వారి సేవలను కొనియాడారు. పెనుగంచిప్రోలులో రెండు ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయాలని కంపెనీ యాజమాన్యాన్ని కోరారు. సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి,కెడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, కోహాన్స్ లైఫ్ సైన్సెస్ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణరెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు వేల్పుల రవికుమార్, మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల రామారావు, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చెరువు పనుల పరిశీలన



జగ్గయ్యపేట అర్బన్: ఊరచెరువు అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా రాఘవేంద్ర మాట్లాడుతూ చెరువును పర్యాటక కేంద్రంగా మార్చేందుకు చేపట్టిన పనులను రెండు విభాగాలుగా చేస్తున్నట్లు తెలిపారు.మొదటి విడత పనుల్లో భాగంగా బుద్ధవిహార్ నుంచి కట్ట మీద ఆంజనేయస్వామి ఆలయం వరకు, రెండో విడత పనులుగా ఆంజనేయస్వామి ఆలయం నుంచి బైపాస్ రోడ్డు పక్కగా కృష్ణుని గుడి, మసీదు మీదుగా బుద్ధవిహార్ వరకు పనులు జరుగుతాయని వివరించారు. ఎర్రకాలువ నుంచి వచ్చే మురుగునీటి కారణంగా చెరువు కలుషితం కాకుండా ఆనీటిని దారి మళ్లిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు ఆల్ట్రాటెక్ సిమెంట్స్ వారు ఇచ్చిన రూ 1.కోటి నిధులతో కాంపౌండ్ వాల్ నిర్మాణం, చెరువు పూడికతీత, జిల్లా మైనింగ్ నిధుల నుంచి వచ్చిన రూ.2 కోట్లతో వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేపట్టామన్నారు. ఎస్ఎఫ్‌సీ నిధులు రూ.కోటితో గ్రీనరీ , వాకింట్ ట్రాక్ చుట్టూ లైటింగ్, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకు సంబంధించి టెండర్లు పిలువనున్నట్లు చెప్పారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు, కౌన్సిలర్లు నూకల సాంబశివరావు, తన్నీరు నాగేంద్ర, మున్సిపల్ అధికారులు, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం

నందిగామ టౌన్: ప్రజారోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు కొనియాడారు. నందిగామ పట్టణంలోని ఎనిమిదోనంబరు సచివాలయం వద్ద 15,16వ వార్డుల ప్రజల కోసం గురువారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ పేదలకు అందని ద్రాక్షలా ఉన్న వైద్యాన్ని వారి చెంతకే చేర్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. రూ.1500 విలువ చేసే వైద్యపరీక్షలను ఈ శిబిరాల్లో ఉచితంగా చేస్తున్నట్లు వివరించారు. అనంతరం శిబిరం వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆయన పరిశీలించారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు ఓర్సు లక్ష్మి, పాకాలపాటి కిరణ్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, నాయకులు ఓర్సు జ్వాలా, అచ్చి శ్రీకర్, షేక్ ఖాలిక్, మున్సిపల్ కమిషనర్ జయరాం, ఏఈ ఫణి శ్రీనివాసరావు, నాయకులు, వలంటీర్‌లు, వైద్యారోగ్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.


నందిగామలో వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు, ఓర్సు లక్ష్మి

జగ్గయ్యపేట మండలంలో..

మల్కాపురం(జగ్గయ్యపేట): జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని వైద్యాధికారి అనిల్‌కుమార్ తెలిపారు. మల్కాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనిల్‌కుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు స్పెషలిస్ట్ వైద్యసేవలు అందిస్తున్నారని వివరించారు. 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆంబోజి జాన్, వైద్యాధికారులు కీర్తిరెడ్డి, నాగరాణి, కార్యదర్శి శ్రావణ్, సచివాలయ ఉద్యోగులు, వైద్యారోగ్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వత్సవాయి మండలంలో..

గోపినేనిపాలెం(వత్సవాయి) : జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేద ప్రజలకు ఆరోగ్య భరోసా కల్పిస్తున్నారని తహశీల్దార్ వైకుంఠరావు తెలిపారు. మండలంలోని గోపినేనిపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. 450 మందికి వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బాణావతు శ్రీను, ఎంపీటీసీ హుస్సేనీ, వైద్యాధికారి సుష్మాప్రియదర్శిని పాల్గొన్నారు.

కంచికచర్ల మండలంలో..

కునికెనపాడు(కంచికచర్ల) : మండలంలోని కునికెనపాడు ఎంపీపీ పాఠశాలలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచి బి.సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతిఒక్కరికీ నాణ్యమైన ఆరోగ్యం అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి రూపకల్పన చేశారని పేర్కొన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మునగ ఆకుతో తయారు చేసిన పోషకాహార స్టాళ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. డీఎల్‌పీఓ బొజ్జగాని శ్రీనివాసరావు, మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంటెంట్ కె.బాలశంకరరావు పంచాయతీ కార్యదర్శి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హుస్సేన్‌బీ, సచివాయ ఉద్యోగులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


మల్కాపురంలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ అనిల్‌కుమార్


కునికెనపాడులో వైద్యపరీక్షలు చేయించుకుంటున్న సర్పంచి బి.సత్యనారాయణ

గడప ముంగిటకే పాలన

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

చందర్లపాడు(నందిగామ టౌన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గ్రామసచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటుతో పాలనను ప్రజల గడప ముంగిటకే పాలన తెచ్చారని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. చందర్లపాడు మండలంలోని తోటరావులపాడులో గురువారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని గడపగడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి సంక్షేమ పథకాల అమలు తేదీలతో కూడిన క్యాలెండర్‌ను ప్రజలకు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ గత ప్రభుత్వాల మాదిరిగా తమ పార్టీ నాయకులు సూచించిన వారికే అందించకుండా, అర్హత కలిగిన ప్రతి ఒక్కరిని గుర్తించి సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. కరోనాతో ప్రపంచ దేశాలు విలవిల్లాడినా వెన్ను చూపకుండా మహమ్మారిని దీటుగా ఎదుర్కొవడంతో పాటు సంక్షేమ పథకాలను సైతం నిలిపివేయకుండా సమర్థవంతంగా అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని చెప్పారు. ప్రతి ఒక్క కుటుంబానికి మంచి చేశామని, మీకు మంచి జరిగింది అని భావిస్తేనే రానున్న ఎన్నికల్లో మద్దతు తెలపాలని చెబుతున్న దమ్మున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ప్రజలకు అన్ని రకాలుగా మంచి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ములకలపల్లి లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ములకలపల్లి కృష్ణమోహన్, వైఎస్ఎన్ ప్రసాద్, నెలకుదిటి శివనాగేశ్వరరావు, మౌలేశ్వరరావు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.


తోటరావులపాడులో పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు

ప్రేమ పేరుతో మోసగించాడంటూ ఫిర్యాదు

జి.కొండూరు: ప్రేమ పేరుతో మోసగించాడంటూ ఓ యువతి జి.కొండూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా యువకుడిపై గురువారం రాత్రి కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జి.కొండూరు మండల పరిధి వెలగలేరు గ్రామానికి చెందిన ఓ యువతి(20) అదే గ్రామానికి చెందిన కంభంపాటి పవన్‌కుమార్ నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. కాగా ఇటీవల ఐశ్వర్య తనను వివాహం చేసుకోమని అతడిని అడగ్గా అందుకు నిరాకరించాడు. ప్రేమ పేరుతో శారీరకంగా వాడుకొని మోసం చేశాడంటూ సదరు యువతి జి.కొండూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ధర్మరాజు తెలిపారు.


విజయవాడ ఇంద్రకీలాద్రిలోని శ్రీకనకదుర్గ అమ్మవారిని గురువారం జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను దర్శించుకున్నారు. వేదపండితులు ఆయనను ఆశీర్వదించారు. ఆలయ అధికారులు ఆయనకు అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు.

ఉత్సాహంగా బతుకమ్మ ఉత్సవాలు



జగ్గయ్యపేట అర్బన్: శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా స్థానిక బతుకమ్మ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బతుకమ్మ వేడుకలు గురువారం రాత్రి స్థానిక శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో అత్యంత వైభవంగా జరిగాయి. రంగురంగుల వివిధరకాల పూలతో తయారుచేసిన బతుకమ్మలతో మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. బతుకమ్మ గేయాలు ఆలపిస్తూ కోలాటం ఆడి, నృత్యాలు చేశారు. బతుకమ్మ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు అనంతరాజా, తులసి సుబ్బారావు, యర్రా శ్రీనివాసరావు, నోముల శివకుమార్, చెక్కా సుధాకర్, కేతవరపు వెంకట్ పాల్గొన్నారు.